మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
బుధవారం 28 అక్టోబర్ 2026 పేజీలు : 4

‘శివ’కు శుభాకాంక్షల వెల్లువ!

కారంపూడి జడ్పీటీసీగా డాక్టర్ కొండపల్లి శివకుమారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పల్నాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అనూహ్యంగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, తొలి ప్రయత్నంలోనే ఏకగ్రీవ విజయాన్ని అందుకున్న ఆమె తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డితో పాటు పార్టీ నాయకులు, శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. అందరి సహకారంతో ప్రజలకు సేవలందిస్తానని ఆమె ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ‘శివ’ రాజకీయ ప్రస్థానంలో తొలి విజయం కొత్త ఉత్సాహాన్ని నింపింది.

ఏకగ్రీవ విజయంతో ఆనందం..

ఏడు దశాబ్దాల రాజకీయ అనుబంధం.. నేడు తన విజయానికి బలమైన పునాదిగా నిలిచిందని బృంగా నాగజ్యోతి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దుర్గి జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో తనకు అవకాశం కల్పించిన జూలకంటి బ్రహ్మానందరెడ్డికి, వెన్నంటి నిలిచిన నాయకులకు, పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తరాలు మారినా చెక్కుచెదరని నమ్మకం, సహకారమే తనకు ఈ గుర్తింపును తీసుకొచ్చాయని భావిస్తూ.. భవిష్యత్తులో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సేవలందిస్తాననే సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు

పల్నాడులో ఏకగ్రీవాల జోరు!

28 స్థానాల్లో 18 ఏకగ్రీవం.. మిగిలిన పదింటికి నవంబరు 3న ఎన్నికలు
జడ్పీ పీఠంపై ఆశావహుల గురి.. కారంపూడి, పెదకూరపాడుపై ప్రత్యేక ఆసక్తి

శిలార్ రక్షణ, ప్రత్యేక ప్రతినిధి

పల్నాడు రాజకీయ చదరంగంలో పావులు వేగంగా కదులుతున్నాయి. స్థానిక ఎన్నికల వేదికపై పైచేయి సాధించిన శక్తులు ఇప్పుడు జిల్లా పరిషత్ పీఠంపై దృష్టి సారించాయి. గెలుపు లెక్కలు ఒకవైపు.. పదవుల పంపకాలపై అంచనాలు మరోవైపు.. ఆశావహుల మధ్య అంతర్గత పోటీకి తెరలేస్తున్నాయి. తెరపై కనిపిస్తున్నది ఏకగ్రీవాల లెక్కే అయినా, తెరవెనుక సాగుతున్నది మాత్రం అధికారం కోసం వ్యూహ ప్రతివ్యూహాలే. సామాజిక సమీకరణాలు, పార్టీ పెద్దల ఆశీస్సులు, రాజకీయ విధేయతలు.. చివరకు జడ్పీ పీఠాన్ని ఎవరికి చేరుస్తాయన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న!

వివరాలు 5లో..

వినుకొండలో ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

రక్షణ న్యూస్, వినుకొండ:
మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళవారం వినుకొండలోని లయోలా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాన్ని, నిర్మల హైస్కూల్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లు, బ్యారికేడ్లు తదితర ఏర్పాట్లను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాలు కురిసిన పక్షంలో ఎన్నికల సామగ్రి పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ టేబుళ్ల సంఖ్య, రౌండ్ల నిర్వహణ, రిసెప్షన్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూముల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలించే సమయంలో ఏ పోలింగ్ కేంద్రానికి చెందిన బాక్సులను ఏ టేబుల్ వద్దకు పంపించాలనే విషయంపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల పంపిణీ, తరలింపులో గందరగోళానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బందికి వసతులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో బాలకృష్ణ పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో 39 నామినేషన్ల ఉపసంహరణ

14 ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ, వైసీపీ నుంచి 14 మంది చొప్పున పోటీ

కర్లపాలెం రక్షణ న్యూస్
కర్లపాలెం మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 79 నామినేషన్లు దాఖలు కాగా, వాటిలో 39 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు మండల రిటర్నింగ్ అధికారి ఘననాథ్ తెలిపారు. మండలంలోని మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ తరఫున 14 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. వీరితో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా బుద్దాం, ఎట్రావారిపాలెం ఎంపీటీసీ స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారని ఆర్వో ఘననాథ్ పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికావడంతో ఆయా స్థానాల్లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులపై స్పష్టత వచ్చిందని తెలిపారు.

ఆర్నబ్ తుఫాన్.. అప్రమత్తంగా ఉండాలి

ఒక్క ప్రాణనష్టం కూడా జరగకూడదు

అమరావతి, రక్షణ న్యూస్..
ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో రైతులు, పంటలు, పశుసంపదను రక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 28న యానాం సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని మంత్రి తెలిపారు. గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం

ఉన్నందున తీరప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మూడు జిల్లాల్లో 24 గంటల కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు నష్టం తగ్గించేలా చర్యలు చేపట్టాలని అచ్చెన్నాయుడు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు, కల్లాల్లోని ధాన్యాన్ని భద్రపరచాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గోదాములు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తి, అపరాల పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని, అరటి, బొప్పాయి, కొబ్బరి, ఆయిల్‌పామ్, మామిడి తోటలను బలమైన గాలుల నుంచి కాపాడేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ముందస్తు హెచ్చరికలు అందించాలన్నారు. పశువులను ముంపు ప్రాంతాల నుంచి తరలించి పశుగ్రాసం, మందులు, పశువైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. చేపలు, రొయ్యల చెరువుల గట్లను పరిశీలించి ఆక్వా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. శ్రీకాకుళంలో వంశధార, నాగావళి పరివాహక ప్రాంతాలు, పార్వతీపురం మన్యంలో కొండ ప్రాంతాలు, గిరిజన గ్రామాలు, కోనసీమలో గోదావరి డెల్టా, తీరప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. తుఫాన్ తగ్గిన వెంటనే పంటలు, ఆస్తుల నష్టాన్ని గ్రామాలవారీగా అంచనా వేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

బాపట్ల జిల్లాకు రెడ్ అలర్ట్

తుఫాన్ వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల, రక్షణ న్యూస్,
ఆర్నబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. ఆదేశించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా, మండల స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్.. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినందున ఆదేశాలు అమలయ్యేలా చూడాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ కూలీలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు పనులకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని

ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. జిల్లాలో 174 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన చోట్ల ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీలు, నీరు ప్రవహించే మార్గాల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, జనరేటర్లు అందుబాటులో ఉంచడంతోపాటు వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వాతావరణ హెచ్చరికల ప్రకారం అక్టోబర్ 27 మధ్యాహ్నం 1.30 గంటల నుంచి అక్టోబర్ 28 ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గాలుల వేగం గంటకు 90 నుంచి 100 కిలోమీటర్లకు, గరిష్ఠంగా 110 కిలోమీటర్లకు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు సురక్షిత భవనాల్లో ఉండాలని, అనవసర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, బలహీనమైన నిర్మాణాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రేపల్లె మండలం కైతేపల్లి పంచాయతీ పరిధిలోని పోటుమెరక గ్రామంలో కలెక్టర్ పర్యటించి పునరావాస ఏర్పాట్లను పరిశీలించారు. గర్భిణుల వివరాలు, రేషన్ బియ్యం పంపిణీ, గ్రామంలో తుఫాన్ ముందస్తు చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపల సాగు జరుగుతున్న ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించాలని, తుఫాన్ ప్రభావం తగ్గే వరకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

తుఫాన్ వేళ విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత

తెగిపడిన తీగలను తాకొద్దు

బాపట్ల రక్షణ న్యూస్,
ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే స్పందించి, సాధ్యమైనంత త్వరగా విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. తుఫాన్ సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సీఎండీ సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, వాటికి సమీపంలోకి వెళ్లకూడదని హెచ్చరించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో

విద్యుత్ పరికరాలు, స్తంభాల వద్దకు వెళ్లడం ప్రమాదకరమన్నారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, ఇతర ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, విద్యుత్ ప్రమాదం జరిగినా అత్యవసర సహాయం కోసం ఏపీసీపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని తెలిపారు. జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లను కూడా సంస్థ ప్రకటించింది.

కంట్రోల్ రూమ్ నంబర్లు:

- **కృష్ణా: 6281709355**
- **ఎన్టీఆర్: 9440817561**
- **గుంటూరు: 9440817526**
- **బాపట్ల: 9281413774**
- **ప్రకాశం: 9440817491**
- **పల్నాడు: 7661019447**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సహాయం అందించాలని సీఎండీ అధికారులను ఆదేశించారు. ప్రజలు విద్యుత్ భద్రతా సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రమాదకర పరిస్థితులను గమనించినప్పుడు స్వయంగా పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా అధికారులకు తెలియజేయాలని ఏపీసీపీడీసీఎల్ విజ్ఞప్తి చేసింది.

ఎన్నికల బరిలో బీజేపీ

కలెక్టర్‌కు బీ-ఫారాలు సమర్పించిన అభ్యర్థులు

బాపట్ల రక్షణ న్యూస్

రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బాపట్ల జిల్లా నుంచి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరఫున పోటీ చేయనున్న ముగ్గురు అభ్యర్థులకు పార్టీ నాయకత్వం బీ-ఫారాలను అందజేసింది. పార్టీ నుంచి బీ-ఫారాలు పొందిన అభ్యర్థులు వాటిని బుధవారం జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. కొల్లూరు జెడ్పీటీసీ సెగ్మెంట్ నుంచి సుగ్గుణ స్రవంతి, చీరాల జెడ్పీటీసీ సెగ్మెంట్ నుంచి నాసిన మణికుమార్, ఈపురుపాలెం ఐదో సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీ



అభ్యర్థిగా పల్లెల లావణ్య బీజేపీ తరఫున పోటీ చేయనున్నారు. ఈ ముగ్గురికి పార్టీ తరఫున బీ-ఫారాలు అందజేయగా, వారు వాటిని కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు తమకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి కొండయ్య, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, పార్టీ అధ్యక్షుడు మాధవ్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకటరమణరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తామని అభ్యర్థులు పేర్కొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు

కర్లపాలెం రక్షణ న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం పంపిణీ చేసే అవకాశాలను నిరోధించడమే లక్ష్యంగా కర్లపాలెం మండలంలోని ఐలాండ్ సెంటర్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహనాల తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ తనిఖీల్లో భాగంగా అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లను బృందం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. వాహనాల్లో అక్రమంగా మద్యం, నగదు తరలిస్తున్నారా అనే అంశంపై

తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నగదు లేదా ఇతర వస్తువుల రవాణా జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల యంత్రాంగం పర్యవేక్షణ చేపట్టింది. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రధాన కూడళ్లు, రహదారులపై వాహనాల రాకపోకలను పరిశీలిస్తూ అనుమానాస్పదంగా కనిపించే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే చర్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్రమ నగదు, మద్యం రవాణాపై నిఘా కొనసాగించేలా చర్యలు చేపడుతున్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని ఎన్నికల యంత్రాంగం సూచిస్తోంది.

వేమూరులో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మక అడుగులు

వేమూరు రక్షణ న్యూస్

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో 68 మంది ఎంపీటీసీ, ఐదుగురు జెడ్పీటీసీ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు పార్టీ సన్నద్ధమైంది. అభ్యర్థులకు రాజకీయ ప్రలోభాలు, ఒత్తిళ్లు ఎదురుకాకుండా ఉండేందుకు చీరాల ప్రాంతంలోని రిసార్ట్స్‌లో బస ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులు పోటీలో ఉండేలా సమన్వయం చేయడంతో పాటు, వారికి భరోసా కల్పించడంపై అశోక్‌బాబు ప్రత్యేక దృష్టి సారించినట్లు నాయకులు పేర్కొంటున్నారు. ఈ చర్యలు పార్టీ బలోపేతానికి దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ, వరికూటి అశోక్‌బాబు అనుసరిస్తున్న వ్యూహాలు పార్టీకి బలాన్నిస్తాయని అన్నారు. అభ్యర్థులందరినీ సమన్వయంతో ఎన్నికలకు సిద్ధం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వరికూటి అశోక్‌బాబు చేపడుతున్న చర్యలను నియోజకవర్గ సీనియర్ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల నాయకులు, పార్టీ కార్యకర్తలు అభినందిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు సమష్టి కృషితో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నాయి.

ప్రజల రక్షణకు పోలీస్ యంత్రాంగం సంసిద్ధం

బాపట్ల రక్షణ న్యూస్

అర్నాబ్ తుఫాన్ బాపట్ల జిల్లా తీర ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాన్ ప్రభావంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలకు పూర్తి భరోసా కల్పిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేసి, తీర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. తుఫాన్ ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్న తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తుఫాన్ సమయంలో ప్రజలు సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లకుండా, వరద ఉధృతి అధికంగా ఉండే వాగులు, వంకలు, కల్వర్టులను దాటేందుకు ప్రయత్నించకుండా అప్రమత్తం చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, విపత్కర పరిస్థితుల్లో వేగంగా స్పందించి ప్రాణనష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పోలీస్ సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహిస్తున్నారని, ప్రజల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా పోలీస్ యంత్రాంగం వెల్లడించింది. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందాలని కోరింది.

తుఫాన్ వేళ విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత

తెగిపడిన తీగలను తాకొద్దు

రక్షణ న్యూస్, విజయవాడ:

తుఫాన్ నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే స్పందించి, సాధ్యమైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, నీరు నిలిచిన ప్రాంతాల్లో విద్యుత్ పరికరాలు, స్తంభాల సమీపానికి వెళ్లకూడదని హెచ్చరించారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా, అత్యవసర సహాయం అవసరమైనా ఏపీసీపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని తెలిపారు.

జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు:

- **కృష్ణా: 6281709355**
- **ఎన్టీఆర్: 9440817561**
- **గుంటూరు: 9440817526**
- **బాపట్ల: 9281413774**
- **ప్రకాశం: 9440817491**
- **పల్నాడు: 7661019447**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎండీ అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సహాయం అందించేందుకు కంట్రోల్ రూములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు విద్యుత్ భద్రతా సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ విజ్ఞప్తి చేసింది.

తుఫాన్ పై కలెక్టర్ అప్రమత్తం

గుంటూరు, రక్షణ న్యూస్,

అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో బుధవారం భారీ వర్షాలు, తీవ్ర గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, నదులను దాటేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు. నీటి ప్రవాహాల వద్ద ఈత కొట్టడం, చేపలు పట్టడం వంటి పనులకు వెళ్లరాదని హెచ్చరించారు. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో బుధవారం (అక్టోబరు 28) పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించామని, అవసరమైతే ప్రజలను 34 పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వాగుల ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని, బలహీనంగా ఉన్న గట్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధం చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, నీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్, రహదారులు, రవాణా, పౌరసరఫరాలు, టెలికాం తదితర శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్లకు విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, అధిక ప్రమాదంలో ఉన్న గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. రైతులకు తగిన సూచనలు అందించాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాన్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

24-10-26 rakshana - Copy_praja jyothi Medhak.qxd 10/27/2026 11:13 PM Page 5

బైపాస్‌పై ఘోర ప్రమాదం.. యువకుడు మృతి

చిలకలూరిపేట రక్షణ న్యూస్

చిలకలూరిపేట బైపాస్ రోడ్డులోని నాదెండ్ల మండల పరిధిలో పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు, అదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న యువకుడిని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారు వేగం, ప్రమాదం జరిగిన తీరు తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట పట్టణంలోని పోలారెడ్డిపాలెంకు చెందిన బత్తుల సురేష్ స్థానికంగా బంగారం వ్యాపారానికి సంబంధించిన పనులు చేస్తూనే న్యాయశాస్త్రం అభ్యసిస్తున్నాడు. యజమాని పనిమీద బంగారం తీసుకురావడానికి బైక్‌పై ఎడ్లపాడు వైపు వెళ్తుండగా, పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో సురేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది.ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న నాదెండ్ల ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలను సేకరించి, ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.కారు అతివేగమే ప్రమాదానికి కారణమా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, కారు డ్రైవర్ నిర్లక్ష్యం ఉందా లేదా అనే అంశాలను పరిశీలించాల్సి ఉంది. పరారైన డ్రైవర్‌ను గుర్తించి, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఆర్నబ్ తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం

174 పునరావాస కేంద్రాల ఏర్పాటు.. కలెక్టర్ వినోద్ కుమార్

బాపట్ల రక్షణ న్యూస్

ఆర్నబ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లను వివరించారు.జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ప్రజల భద్రత కోసం 174 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాల సహకారంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నామని, మంగళ, బుధవారాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు.జిల్లాలోని ఏడు డ్రైన్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచామని, పర్యాటక ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా విస్తృత ప్రచారం చేపట్టామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని, ఉపాధి హామీ కూలీలు, ఫ్యాక్టరీ కార్మికులు పనులకు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు.ఈ సమావేశంలో సాధారణ ఎన్నికల పరిశీలకురాలు ఏ.ఏ.ఎల్. పద్మావతి, ఇన్‌చార్జి డీఆర్‌ఓ లవన్న, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో జనసేన జోరు

పొన్నూరు రక్షణ న్యూస్



పొన్నూరు జడ్పీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన సూదా ప్రభావతి ఖరారయ్యారు. ఈ మేరకు పార్టీ నాయకులు ఆమెకు బీ-ఫామ్ అందజేశారు. కూటమి పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో పార్టీ నాయకత్వం ప్రభావతి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది.ఈ స్థానం నుంచి పలువురు నాయకులు నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ, వెల్లలూరు గ్రామానికి చెందిన సూదా ప్రభావతిని పార్టీ అధిష్ఠానం తుది అభ్యర్థిగా ఎంపిక చేసింది. దీంతో పొన్నూరు జడ్పీటీసీ ఎన్నికల్లో ఆమె జనసేన తరఫున పోటీ చేయనున్నారు.

లోతట్టు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి

అర్నబ్ తుఫాను నేపథ్యంలో కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు

రేపల్లె రక్షణ న్యూస్

అర్నబ్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రేపల్లె మండలం కైతుపల్లి పంచాయతీ పరిధిలోని పోటుమెరక గ్రామంలో పర్యటించి తుఫాను ముందస్తు చర్యలను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని సూచించారు.గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలపై ఆరా తీశారు. తుఫాను సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నవంబర్ నెల రేషన్ బియ్యాన్ని ముందుగానే పంపిణీ చేయాలని సూచించారు. చౌక ధరల దుకాణాన్ని సందర్శించి బియ్యం పంపిణీని పరిశీలించారు.సాగునీటి కొరతపై

రైతులతో మాట్లాడిన కలెక్టర్.. కాలువల్లో మోటార్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని, చివరి భూముల వరకు నీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని నిరుపేద జయప్రద కుటుంబ పరిస్థితులను తెలుసుకుని, పీఎంఏవై పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణ నిధులు త్వరలో అందుతాయని తెలిపారు. అనంతరం సుమారు 100 ఎకరాల్లో చేపల సాగును పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు.ఈ పర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి జగన్ మోహనరావు, రేపల్లె ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలించాలి

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

బాపట్ల రక్షణ న్యూస్

తుఫాన్ ప్రభావం నేపథ్యంలో బాపట్ల నియోజకవర్గంలోని తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ సూచించారు. తుఫాన్ కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. తీర ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట్ల

ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టాలని తెలిపారు.తుఫాన్ ప్రభావం వల్ల ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నరేంద్ర వర్మ పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.ప్రజలు తుఫాన్ సమయంలో అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే కోరారు. విద్యుత్ వైర్లు, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఉండకూడదని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, సురక్షితమైన ప్రదేశాల్లో ఉంటూ తుఫాన్ ప్రభావం నుంచి రక్షణ పొందాలని సూచించారు.

పల్లెల్లో పసుపు జెండాల రెపరెపలు..!

ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు ఘన స్వాగతం.. ప్రచారంలో యువత, మహిళల ఉత్సాహం

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. బాపట్ల మండలంలోని చెరువు, చెరువు జమ్ములపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పసుపు జెండాలతో గ్రామ వీధులు సందడిగా మారగా, యువకులు, మహిళలు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు.ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజుకు గ్రామాల్లో ప్రజలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కూటమి అభ్యర్థులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కూటమి అభ్యర్థి చుక్క నర్మద, ఎంపీటీసీ, ఎంపీపీ అభ్యర్థి మున్నం ఏడుకొండలు రెడ్డి, చెరువు ఎంపీటీసీ సెగ్మెంట్ అభ్యర్థి మోచర్ల రాజమ్మ, చెరువు జమ్ములపాలెం ఎంపీటీసీ సెగ్మెంట్ అభ్యర్థి కుర్ర శ్రీలక్ష్మి ప్రచారంలో పాల్గొన్నారు.గ్రామాల్లో తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా నిలుస్తామని పలువురు ప్రజలు ప్రచారంలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి. ప్రభుత్వానికి అందిస్తున్న మద్దతును స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగిస్తూ జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు అండగా నిలుస్తామని ప్రజలు చెబుతున్నారనే అంశాన్ని నాయకులు ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించారు.ఎమ్మెల్యే వెంట యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొనడం గ్రామాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పసుపు జెండాలతో కదం తొక్కిన పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతు కోరాయి. గ్రామాభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలతో మమేకమయ్యారు.చెరువు, చెరువు జమ్ములపాలెంకనిపించిన సందడి కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామస్థాయి ప్రచారాన్ని మరింత విస్తృతం చేస్తూ, అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పల్నాడులో ఏకగ్రీవాల జోరు!

మొదటి పేజీ తరువాయి

శిలార్ రక్షణ, ప్రత్యేక ప్రతినిధి:

పల్నాడు జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల రాజకీయం ఆసక్తికరంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని 28 జడ్పీటీసీ స్థానాల్లో 18 స్థానాలు ఏకగ్రీవమైనట్లు అందిన వివరాలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన పది స్థానాలకు నవంబరు 3న ఎన్నికలు జరగనున్నాయి. ఏకగ్రీవాల నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న నేతలపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ముఖ్యంగా కారంపూడి జడ్పీటీసీ కొండపల్లి శివకుమారి, పెదకూరపాడు జడ్పీటీసీ నల్లపాటి కీర్తన పేర్లు ప్రధానంగా వినిపిస్తుండటంతో ఈ రెండు స్థానాలపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది.జిల్లాలో ఏకగ్రీవమైనట్లు పేర్కొన్న స్థానాల్లో మాచర్ల, కారంపూడి, రెంటచింతల, దుర్గి, వెల్దుర్తి, నరసరావుపేట, రొంపిచర్ల, ఈపూరు, గొల్లపల్లి, వినుకొండ, శావల్యాపురం, యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట, అచ్చంపేట, అమరావతి, బెల్లంకొండ, పెదకూరపాడు ఉన్నాయి. ఈ స్థానాల్లో ఏకగ్రీవాల నేపథ్యంలో మిగిలిన ప్రాంతాల్లో జరిగే పోటీపై రాజకీయ వర్గాలు దృష్టి సారించాయి. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల బలాబలాలు, స్థానిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి.జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో కారంపూడి జడ్పీటీసీ కొండపల్లి శివకుమారి, పెదకూరపాడు జడ్పీటీసీ నల్లపాటి కీర్తన పేర్లు చర్చకు వస్తున్నాయి. అయితే చైర్మన్ ఎంపికలో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల సంఖ్య ఒక్కటే నిర్ణయాత్మకం కాదు. పార్టీ నాయకత్వ నిర్ణయాలు, సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలు, ఇతర ప్రజాప్రతినిధుల మద్దతు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో ఆశావహులు తమకు అనుకూలమైన పరిస్థితుల కోసం ఎదురుచూస్తున్నారు.మిగిలిన పది జడ్పీటీసీ స్థానాలకు నవంబరు 3న జరగనున్న ఎన్నికలు జిల్లా రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. ఆయా ప్రాంతాల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఎలా ఉండనుంది? ఓటర్లు ఎవరికి మద్దతు పలకనున్నారు? అన్నది ఆసక్తికరంగా మారింది. పోలింగ్ అనంతరం వెలువడే ఫలితాలతో జిల్లా పరిషత్‌లో రాజకీయ బలాబలాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా పల్నాడు జడ్పీటీసీ ఎన్నికలు, చైర్మన్ పీఠం కోసం ఆశావహుల ప్రయత్నాలు జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.